# నేనూ... సావిత్రీ బాయిని



సుషమా దేశ్‌పాండే

ఓల్గా

అస్మిత

# నేనూ....సావిత్రీ బాయిని

మరాఠీ మూలం : **సుషమా దేశ్‌పాండే**
తెలుగు అనువాదం : **ఓల్గా**

మొదటి ముద్రణ : మార్చి 8, 2000
రెండవ ముద్రణ : ఫిబ్రవరి 20, 2005

ప్రతులు : 1000

డిజైనింగ్, బుక్ మేకింగ్ : జుగాష్‌విలి

కంపోజింగ్ : ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్, హైదరాబాద్ -44
ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

ప్రతులకు :
అస్మిత, రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్,
టీచర్స్ కాలని, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికిందరాబాద్

నవోదయ, కాచిగూడ, హైద్రాబాద్
విశాలాంధ్ర - అన్ని బ్రాంచీలు
ప్రజాశక్తి - అన్ని బ్రాంచీలు

వెల : రూ.50/-

# నేనూ... సావిత్రీ బాయిని

మరాఠీ మూలం

**సుషమా దేశ్‌పాండే**

అనువాదం

**ఓల్గా**

**అస్మిత**

**రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్**

**హైదరాబాద్**

**నమస్కారం!**

ఇవాళ మీ అందరితో మాట్లాడటానికి వచ్చాను. ఈ అమ్మాయి రూపంతో వచ్చాను. నేను కళ్లు తెరిచి నా చుట్టు యేం జరుగుతోందని చూస్తే గుండె పగిలి పోతోంది. మా కాలం వెళ్లిపోయింది. కానీ మీరందరూ మా కాలంలో మేం యెక్కడున్నామో అక్కడే నిలబడిపోయారా అని ఆశ్చర్యం కలుగుతుంది నాకు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుందా అనుకుంటాను. నాకీరోజు మీతో యెంతో చెప్పాలని ఉంది. ఎన్నో విషయాలు, మేం యెట్లా బతికాం, యేం చేశాం. అన్నీ! ఆగండి. మేమేదో గొప్ప ఘనకార్యాలు చేశామని చెప్పబోవటం లేదు. నా గురించి చెప్పాలంటే నేను సేఠ్‌జీ పెళ్లాన్ని కాగానే ఆయన చేసే పనిలో చిక్కుకుని పొయ్యాను. ఆ పనేమిటో, దాని సంగతేమిటో తెలియకుండానే అందులో చిక్కుకున్నాను. అదెలా జరిగిందో తెలియకముందే అదంతా నా పని అనుకోవటం బొత్తిగా బాగోలేదు.

మొదట్నించి చెప్తా వినండి. నేను పుట్టిందేమో నైగావ్. అయ్యో అదెక్కడుందో. మీకు తెలియదుగదూ! మహారాష్ట్రలో సతారా జిల్లాలో ఖండాలా తాలూకాలో వుంది. అబ్బో యెంత కుగ్రామమనీ, అక్కడసలు మనుషులుంటారా అని అనుమానం కలిగేంత చిన్నవూరు. ఆ రోజుల్లో ఆ వూళ్లో అందరూ అందర్నీ యెరిగివుండేవాళ్లు. నేనా? పాటిల్ గారింట్లో పెద్ద కూతుర్ని, మొదటి సంతానాన్ని, అబ్బా - మీకదంతా చూపించేదా? ఆ చేలల్లో పడి పరిగెత్తుతూ, ఆ గులకరాళ్లను, దుమ్మునూ తన్నుకుంటూ - ముళ్లు గుచ్చుకోవా అంటున్నారా? ముళ్లూ గిళ్లూ యేవీ లెక్కలేదు నాకు. విరబోసుకున్న జుట్టు ముఖం మీద పడుతుంటే వెనక్కు తోసుకుంటూ వూరంతా వెర్రిగా పరిగెత్తేదాన్ని.

నాలుగేళ్లు నిండాయోలేదో మా అమ్మ యిక మొదలుపెట్టింది. 'ఇంక నువ్వు రొట్టెలు కాల్చడం నేర్చుకోవాలి. పెద్దదానివవుతున్నావు' అయితే నేను మాత్రం మట్టిలో నీళ్లు పోసి, పిసికి ముద్దచేసి ఆడేదాన్ని గానీ గోధుమపిండిలో నీళ్లుపోసి పిండి ముద్దని కలిపేదాన్ని కాదు. అబ్బా మా అమ్మ యెట్లా అరిచేదనీ, చేతికి యేది దొరికితే అది తీసుకుని నా వెంటబడేది. పాడుపిల్లా, నీమెళ్లో పసుపుతాడు కట్టేవాడి కోసం వెతకలేక తిప్పలు పడుతుంటే నువ్విట్లా చేస్తావా' అని తిట్టేది. నాకేం లెక్కలేదు. నేను మా నాన్న వెనక దాక్కుంటే చాలు. ఎవ్వరూ యేం చెయ్యలేరు.

చింతకాయలు కొట్టుకు తినటం, రేగుపళ్లు కోసుకు తినటంలో నన్ను మించినవాళ్లు లేరు. ఒకరోజు యేమైందో తెలుసా- ఔను మీరనుకుంటున్నట్టే జరిగింది. నేనెక్కిన సీమ చింతచెట్టు కొమ్మ విరిగింది. నేనా కొమ్మపట్టుకుని వుయ్యాల వూగుతున్నా - సీమ చింతకాయలు నా పరికిణీలోంచి కిందపడిపోతున్నాయి. 'అమ్మా -నా సీమసింతకాయలు - నేను పడిపోతున్నా. కొమ్మవిరిగింది, పడిపోతున్నా'నా గోలకి అమ్మ పరిగెత్తుకొచ్చింది. వచ్చింది నన్ను దించొచ్చు కదా - ఊహూ-వెళ్లి మా నాన్నను పిల్చుకొచ్చింది. 'చూడండి మీ ముద్దుల కూతురు యేం చేసిందో' అంటూ అమ్మ నావైపు చూపిస్తూ, నేనేమో కొమ్మకు వేలాడుతూ, మా నాన్న విరగబడి నవ్వుతూ - ఎంత బాగుంది... కదూ-

నాన్న నన్ను కిందికి దించాడు. అమ్మ మాత్రం ఆపలేదు 'ఈ పిల్లకు తొందరగా పెళ్లి చేసి పంపించాలి. ఏ కాలో చెయ్యో విరక్కొట్టుకుంటే యెవరు చేసుకుంటారు? గుదిబండలా మన మెడకు చుట్టుకువేలాడుతుంది. అసలిది ఆడపిల్లేనా అంట?'

'నేను ఆడపిల్లను కాదమ్మా - యిదుగో ఈ సీమ చింతకాయ చూడు యెంత తియ్యగా వుందో' నేను పెద్ద లొద్దని నోట్లో కుక్కుకుంటూ అమ్మకు ఒకటిచ్చి మళ్లీ పరుగుతీసేదాన్ని.

కానీ నాన్న కూడా ఈ పిల్లకు పెళ్లిచేసి పంపాలి అను అనుకోవటం మొదలుపెట్టాడు. పూనాలో వుండే పూలే కుటుంబంలో ఒక అబ్బాయితో నా పెళ్లి నిశ్చయించాడు. ఈ సేఠ్‌జీ యెట్లా వుంటాడబ్బా అనుకునేదాన్ని!



చింత చెట్లెక్కుతాడా?

బావిలో ఈత గొడతాడా?

రాత్రిళ్లు ఆరుబైట పడుకుని చుక్కలు లెక్కబెడతాడా?

ఏమో - ఎవరికి తెలుసు? బళ్ళో చదువుకుంటున్నాడని చెప్పారుగా. పుస్తకాలు చదవగలడేమో!

అబ్బో - మీరేమైనా అనండి. పెళ్ళి కుదిరిందనగానే నాకెంత సంబరమో. యెంత గర్వమో. అమ్మనీ, నాన్ననీ వొదిలి వెళ్లాలనే బాధ ఒక పక్కావున్నా, నా హృదయం పురి విప్పిన నెమలి లాగా నాట్యం చేసింది. నేను పెద్ద పట్నానికి వెళ్తున్నాను. గుర్రబ్బండిలో కూచుని వెళ్తున్నాను. ఇక ఆ పట్నంలో చూడ్డానికి యెన్ని వింతలైనా వుంటాయి.

ఆ రోజుల్లో ఆడవాళ్లు గడప దాటకూడదు. ఆడపిల్ల పెరిగి పెద్దయ్యేసరికి - లక్ష్మణుడు గీసిన గీత దాటటం వల్లనే సీతమ్మవారిని రావణాసురుడు యెత్తుకు పోయాడనే కథ యెన్ని వందలసార్లు వింటుందో యెవరూ లెక్కబెట్టలేదు. ఆడదంటే వంటింటికీ, వంటింట్లో పొయ్యికీ కట్టుబడి వుండాలి. పొయ్యిలో కట్టెలు, పొయ్యి వూదే గొట్టం ఆ పిల్లచేతిలో వుండాల్సిందే. ఆ పిల్ల ఆ గొట్టం గుండా వూపిరంతా పొయ్యిలోకి వూదాల్సిందే. భర్తనీ, అత్త మామల్ని సేవించుకోవాలి. అంతే యిక నీ పని. ఇప్పుడు మీ పిల్లలు రెండో తరగతి చదువుతుంటే, మీరు బుజ్జగిస్తుంటారే - ఆ వయసులో మేం మా అత్తగారింట్లో వుండేవాళ్లం.

ఇది వినండి. నా పెళ్లిలో - అదే మా పెళ్లిలో - పెద్ద గుంపు చేరింది. నా పరికిణీ తీసేసి చీరె చుట్టబెట్టారుగా. నేనో దిష్టిబొమ్మలా వున్నాను గానీ పెద్ద రాణిగారిలా చూస్తున్నా అందర్నీ, నా తలమీద పెళ్లి ముసుగు దాని మీదుగా పూలహారాలు వేలాడుతుండగా నా పక్కనున్న యింకో దిష్టిబొమ్మను వోరగంట చూశాను. అదే - నా మొగుడు గారిని, అబ్బా నవ్వాపుకోలేకపోయ్యా. అతనేమో తెలివిగలవాడంటారు చూడ్డానికి యెట్లా వున్నాడో చెప్పలేం. సరే నేను మాత్రం రంభనా యేమిట్లే అనుకుంటుండగా యేదో పురుగు నా చీరెలో జొరబడి చెప్పరాని చోట కుట్టింది.

'అమ్మో-అమ్మో-యేంటో కుట్టిందే' ఆ పందిరంతా పరిగెత్తుతున్నాను. చీరె సగం వూడిపోయింది. అమ్మ అరుస్తోంది. 'సావీ-సావీ-చీరె సరిగ్గా చూసుకో- ఆడదానివి కాదూ-' 'అమ్మా-నన్నేదో కుట్టిందే' నేను పిచ్చిగా గంతులేస్తూనే వున్నా 'నీ అల్లరి ఆపుతావా లేదా? అత్తా మామల ముందేనా నీ ఆగడం, సిగ్గులేదూ? మా పరువు తీస్తున్నావు. నువ్వు ఆడదానివి. ఎంత నొప్పయినా వోర్చుకోవాల్సిందే. ఏదన్నా కుడితే చప్పుడు చెయ్యకుండా ఓ మూలకు పోయి పురుగుని తీసి పారేయ్యాలి గానీ, వూరూ వాడలూ యేకం చేస్తావా?' కానీ మా అమ్మ తిట్లు నా గంతుల్ని ఆపలేకపోయాయి. అప్పుడు సేఠ్‌జీ, నా సేఠ్‌జీ మా అమ్మతో అన్నాడు. ' ఆ అమ్మాయిని తిట్టకండి. ఆడపిల్లయితే యేమైంది? పురుగు కుట్టటానికి ఆడా మగా వుండదు. ఆమె చీరలో యేం దూరిందో తీసుకెళ్లి చూడండి' అన్నాడు. చీరె నా వెనకాల యీడ్చుకుంటూ నేను గదిలోకి వెళ్లాను ఆ పురుగు తీసిపారేశాను. నా గుండెలో సేఠ్‌జీ మాటలు దీపంలా వెలుగుతున్నాయి. నా భర్త, నా దేవుడు.

మా అత్తగారింట్లో నేనెన్నడూ పరాయి దానిలాగా అనుకోలేదు. అదే అసలు నీయిల్లని ఆడపిల్ల రక్తంలో యింకిపోయేట్లు చెప్తారనుకోండి. కానీ మా మామగారు చాలా మంచి మనిషి. నేను అచ్చంగాయాలు ఆడుకుంటున్నప్పుడే, ఆయనకు యేదన్నా కావాల్సి వస్తే యెంత నెమ్మదిగా పిల్చేవాడనీ! ఇక మా సేఠ్‌జీకి యెప్పుడూ బడీ, పుస్తకాలు, చదువు. యిదే ప్రపంచం. ఇంతింత లావు పుస్తకాలు ముందేసుకుని యెప్పుడూ చదువుతూనే ఉండేవాడు. రాస్తూనే వుండేవాడు. వాళ్ల పంతులుగారికి ఈయనంటే పరమ యిష్టమంట. ఆఁ! ఎప్పుడూ పుస్తకాల్లో మునిగివుంటే యెందుకిష్టం వుండదూ? ఒక్కసారి వచ్చి నాతో ఆడుకోమని అడిగితే యిక చిరునవ్వు చిందిస్తాడు. అన్నీ తనకు తెలుసన్నట్లు బడాయి.

సేఠ్‌జీ సావాసగాళ్లు - నాకు ఆయన్ని సేఠ్‌జీ అనే పిలవటమే యిష్టం. సేఠ్‌జీ అని యెలాంటి మనిషిని పిలుస్తారో మీకు తెలియదూ? పొడుగ్గా, గర్వంగా, అందంగా వుండేవాళ్లని, సేఠ్‌జీ సావాసగాళ్లు యింటికొస్తుండేవాళ్లు సదాశివ బల్లాల్ గోవింద, మోరో విఠల్ వాల్వేకర్, సుఖరామ్ పరాంజపే వీళ్లంతా వచ్చేవాళ్లు. అంతా కలిసి యెట్లా చదివేవాళ్లో - ఒకటే మాటలు. ఎప్పుడూ ముచ్చట్లే అంతుండేది కాదు. ఒక కులం వాళ్లు కాదు, ఒక మతం వాళ్లు కాదు. ఎవరి కులంలో యెట్లాంటి పద్ధతులుంటాయో అవన్నీ చెప్పుకునే వాళ్లు. ఒకసారి మా మామగారు సేఠ్‌జీని స్కూల్లోంచి తీసేయించి, యింట్లో వుండమన్నారు. ఆ విషయం గురించి స్నేహితులంతా మాట్లాడుకుంటుంటే నేను చాటునుంచీ విన్నాను. గోవింద అంటున్నాడు. 'నిన్నెందుకు బళ్లోనించి తీసేశారు?'

'అదంతా మా కులపెద్దల పనిరా. కొంత మంది గవర్నమెంటు వుద్యోగులు చేశారీ పని'.

'ఎందుకురా?'

'ఆఁ- మన కులపు పిల్లవాళ్లు బడికెందుకు పోవాలి అన్నారు'

'వెళ్తే తప్పేంటి?'

'బుర్రలో జ్ఞానం చేరి దాన్ని పనిచేయిస్తుంది. నేను బడికెళ్తే సోమరిపోతు నవుతానంట, పొలం పని చెయ్యటానికి పనికిరానంట. మోట కొట్టలేనంట, పార పట్టలేనంట'.

'మీ నాన్న అట్టా అన్నాడా?'

'మా నాన్న అన్లేదురా వెర్రాడా. ఆయన నేనెంత చదివితే అంత చదివిస్తాననే అన్నాడు. కానీ మా మేనమామ - యింకా ఈ వుద్యోగస్తులూ కలిసి ఆయన బుర్ర తిన్నారు'

'మరి మళ్లీ బడికెలా పంపించారు.'

'మా తోట దగ్గర గఫార్ బేగ్ మున్షీ వుంటాడే - తెలుసా నీకూ'

'ఆ ముస్లీమా?'

'ఔను. చాలా తెలివైనవాడు, పండితుడు, ఆయనా మిస్టర్ లెజిట్ కలిసి మా నాన్నతో చెప్పారు నన్ను చదివించమని'

'బడికి రానప్పుడు నువ్వేం చేసే వాడివిరా?'

'తోటలో పనిచేశా. ఇంకేం జేస్తాను? వాళ్ళిద్దరూ విద్య యెంత అమూల్యమైనదో చెప్పారు.

'నువ్వు కష్టపడి చదవబట్టే యిదంతా కుదిరిందిరా'. ఔను. అది మాత్రం నిజం, అతనికి పెళ్లయింది. చదువుకుంటున్నాడు అన్నీ తెలిసినట్లు మాట్లాడతాడు. మంచిదే, నీకన్నీ తెలుసు కానీ యేమీ తెలియని నీ పెళ్ళాం సంగతి కూడా కాస్త చూడాలా లేదా? నాలో నేనే అనుకునేదాన్ని. లేకపోతే అచ్చం గిల్లాలతో చెప్పుకునేదాన్ని. నిజం చెప్తున్నా. పొద్దుగూకూలూ బడే బడి, ఇంట్లో వుంటే యిది చదవాలి. అది చదవాలి. అదీ కాదంటే లాహూజీ బావా దగ్గరకు వెళ్లి కత్తియుద్ధాలు, కసరత్తులూ నేర్చుకోవటం. ఇక నేనూరుకోలేక అడిగేశాను. 'రోజంతా బళ్ళోనో, కసరత్తుల్తోనో గడుపుతున్నావు. బాగానే వుంది. మరిక్కడ నా గతేమిటి? ఆడుకోటానికి యెవరూ లేక తోచక చస్తున్నా' అని. సేఠ్‌జీ పెద్ద మనిషిలాగా సమాధానం యిచ్చాడు.

'మంచి మెదడుకి తోడుగా ఆరోగ్యకరమైన శరీరం వుంటే యే పనైనా తేలిగ్గా చేయగలం'.

'నీ పెళ్ళాంతో ఆడుకోవటం పని కాదా' అని అడగబోతున్నాను. అంతలో మా మామగారొచ్చారు. నేను అవతలకు పరిగెత్తాను. ఆయన ముందు సేఠ్‌జీతో మాట్లాడటమే! మీకు తెలుసా! నాకు తోచక చస్తున్నాననేది నిజం కాదు. వంట చెయ్యటం నేర్చుకున్నావా. ఇల్లూడ్చి, తుడిచి నీళ్ళు తెచ్చేదాన్నా! కానీ కాసేపన్నా సేఠ్‌జీ నాతో మాట్లాడితే బాగుండే అని కోరిక. ఆయన్ని ఏమడిగినా చిరునవ్వే సమాధానం. ఐనా సరే నాకాయన మీద కోపం వచ్చేదే కాదు.

ఒకరోజు నేను యిల్లు సర్దుతున్నాను. పుస్తకాల గుట్టమీద వున్న దుమ్ము దులుపుతున్నాను. ఇల్లు శుభ్రంగా వుంచాలి గదా. అదుగో అప్పుడే ఆయనొచ్చాడు.

'నా పుస్తకాలనేం చేస్తున్నావు?'

'దుమ్ము దులిపి శుభ్రం చేయొద్దా?'

'పేజీలు పోగొడతావ్ జాగ్రత్త?'

'ఎక్కడికి పోవు, అన్నీ వుంటాయి. యిదేంటో మరి?'

'ఏ పేజీ అది'

'ఏ పేజీనో యేంటో నాకేం తెలుస్తుంది? ఏదైతే యేమయిందని మీరిప్పుడీ రగడ చేస్తున్నారు?'



'అవన్నీ జీవితచరిత్రలు. యిదిగో చూడు. ఇది శివాజీ గురించి రాసింది. ఆయన ఫోటో యిది. ఇక్కడ వాషింగ్‌టన్ గురించి రాశారు. ఇది ఆయన ఫోటో.

'ఎవరూ! శివాజీ నాకూ తెలుసు. మనవాడేకదా - కానీ ఈయనెవరూ?' పరాయి, దేశం మనిషిలాగా వున్నాడు.

'మనదేశం అయితేనేం - కాకపోతేనేం. మనిషి మంచి పనులు చేస్తే మనం అతని జీవితం, వ్యక్తిత్వం, విలువలు అన్నీ తెలుసుకోవాలి.'

'అబ్బో ఈ సంగతులన్నీ మీ బుర్రలో వున్నట్టే చెప్తున్నారే'.

'బుర్రలో వుంచాలనే ప్రయత్నిస్తున్నా. ఈ పుస్తకం చూడు. ఇది థామస్ పెన్ రాసిన 'మానవుని హక్కులు' అన్న పుస్తకం. మనిషికున్న హక్కులేమిటో బాధ్యతలేమిటో అన్నీ ఈ పుస్తకంలో రాసివున్నాయి.'

'నిజంగానా? నీకూ రాయటం వచ్చుగా. యిలాంటి పుస్తకాలు రాస్తావా?'

'రాయొచ్చు'

'రాస్తే అవి నాకు చదివి వినిపిస్తావా?'

నేను వూరికినే అడిగా, ఎలాగోలా నాతో మాట్లాడుతున్నాడు. ఆయనకు పుస్తకాల గురించి మాట్లాడటం యిష్టమైతే నేను అవే మాట్లాడతాను.

'సేఠ్‌జీ' అని మొదటపెట్టాను. పొరపాటున ఆ పేరుతో ఆయన్ని పైకి పిలిచేశాను.

'ఏమన్నావ్' అన్నాడాయన.

'అబ్బే-యేం లేదు'

'చెప్పాల్సిందే'

'నేను చెప్పను'

'నాకిది చెప్పావంటే, రోజూ నీకు యేదో వొకటి చదివి వినిపిస్తా'

'ఒట్టూ! ప్రతిరోజూ?

'ప్రతిరోజూ! యిప్పుడు చెప్పు యిందాకా యేమన్నావ్?'

'నిన్ను - నిన్ను సేఠ్‌జీ అని పిల్చాను. నేనలాగే పిల్చుకుంటాను' ఆయన నవ్వాడు.

'నీకు కోపం రాలేదుగా? నిజం చెప్పు'

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=422**